ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY

5 తమిళనాడు TAMILNADU

మంగళవారం 23 సెప్టెంబరు 2025



# 'చెన్నై వన్'

## ఒకే యాప్‌లో మూడు రకాల రవాణా సేవలు



'చెన్నై వన్' యాప్ ఆవిష్కరిస్తున్న సీఎం స్టాలిన్, మంత్రులు తదితరులు

చెన్నై, సెప్టెంబరు 22 (ఆంధ్రజ్యోతి): చెన్నై మహానగర ప్రజా రవాణా సేవలన్నింటినీ సంయుక్తంగా నగరవాసులు సులువుగా పొందేలా రూపొందించిన 'చెన్నై వన్' మొబైల్ యాప్‌ను ముఖ్యమంత్రి స్టాలిన్ సోమవారం ఆవిష్కరించారు. ఈ యాప్ ద్వారా బయలుదేరే ప్రాంతాన్ని, గమ్యస్థానాన్ని తెలుపుతూ క్యూఆర్ కోడ్‌తో ఓ టికెట్‌ను పొందితే మహానగర రవాణ సంస్థ (సిటీ) బస్సులు, మెట్రోరైళ్లు, సబర్బన్ విద్యుత్ రైళ్లలో టికెట్ల కోసం వేచిఉండకుండా ప్రయాణించవచ్చని ఈ సందర్భంగా స్టాలిన్ తెలిపారు. ఉమ్మడి రవాణా సేవలన్నింటికీ కలిపి ఒకే విధమైన యాప్ ప్రవేశపెట్టడం దేశంలో తొలిసారని ఆయన పేర్కొన్నారు. నగరంలో సిటీ బస్సులు, మెట్రోరైళ్లు, సబర్బన్ రైళ్ల ప్రజా రవాణా సేవల ద్వారా ప్రతి రోజూ సుమారు 5 లక్షల మంది లబ్ధిపొందుతున్నారు. ఈ మూడు రకాల రవాణా సంస్థల సేవలను ఒకే టికెట్ ద్వారా పొందటానికి వీలుగా ఈ యాప్‌ను మహానగర రవాణా సంస్థ రూపొందించింది. ఈ యాప్‌లో చెన్నై, సబర్బన్ ప్రాంతాల్లో ఉన్న 600 బస్‌స్టాపులు, 650 బస్సు రూట్లు, 3500 బస్సులకు సంబంధించిన సమాచారం, మెట్రోరైళ్లు, సబర్బన్ రైళ్లకు సంబంధించిన సమాచారం, ఆయా మార్గాల్లో బస్సులు, రైళ్లు ఏయే సమయాల్లో చేరుకుంటాయనే వివరాలు కూడా లభిస్తాయి. వీటికి తోడు అద్దె కార్లు, ఆటోలను ముందుగా బుక్ చేసుకునే సదుపాయం కూడా ఈ యాప్‌లో వుందని సీఎం స్టాలిన్ వివరించారు. ఈ కార్యక్రమంలో ఉప ముఖ్యమంత్రి ఉదయనిధి, మంత్రులు ఎస్.రఘుపతి, ఎస్.ముత్తుసామి, ఎస్ఎస్ శివశంకర్, పీకే శేఖర్‌బాబు, గ్రేటర్ చెన్నై కార్పొరేషన్ మేయర్ ప్రియ, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి ఎన్.మురుగానందం, గృహ వసతి, నగరాభివృద్ధి శాఖ ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కాకర్ల ఉష, ఆర్థిక శాఖ ముఖ్య కార్యదర్శి డి.ఉదయచంద్రన్ తదితరులు పాల్గొన్నారు.

# వైభవంగా తిరుమల గొడుగుల ఊరేగింపు

ప్యారీస్, సెప్టెంబర్ 22 (ఆంధ్రజ్యోతి): తిరుమల శ్రీవారి బ్రహ్మోత్సవాల్లో సమర్పించేందుకుగాను 'హిందూ ధర్మార్థ సమితి' ఆధ్వర్యంలో సోమవారం గొడుగుల ఊరేగింపు జరిగింది. చెన్నైలోని ప్యారీస్ చెన్నకేశవ పెరుమాళ్ ఆలయంలో 21వ వార్షిక తిరుమల గొడుగుల ఊరేగింపును ఉడిపి పాలిమార్ మఠాధిపతి విద్యాధీశ తీర్థ స్వామి ప్రారంభించారు. ఉదయం 10.20 గంటలకు ప్రత్యేక పూజలు నిర్వహించిన అనంతరం ఆలయ ప్రాంగణంలో జరిగిన ప్రారంభోత్సవంలో హిందూ ధర్మార్థ సమితి ట్రస్టీ ఆర్ఆర్ గోపాల్, నిర్వాహక ధర్మకర్త ఎస్.వేదాంతం, విశ్వ హిందూ పరిషత్ విద్యా కేంద్రం ప్రధాన కార్యదర్శి గిరిజా శేషాద్రి, తమిళనాడు విశ్వ హిందూ పరిషత్ చైర్మన్ ఆర్.చెల్లముత్తు, ప్రధాన కార్యదర్శి ఎస్ఎస్.సోమసుందరం తదితరులు పాల్గొన్నారు.

అనంతరం చెన్నకేశవ పెరుమాళ్ ఆలయం నుండి ఉదయం 11.30 గంటలకు తిరుమలకు 11 గొడుగులతో బయలుదేరిన ఈ ఊరేగింపు నేతాజీ సుభాస్ చంద్రబోస్ రోడ్డు, గోవిందప్ప నాయకన్ వీధి, భైరాగి మఠం, వాల్‌ట్యాక్స్ రోడ్డు మీదుగా సాయంత్రం 4 గంటలకు ఎలిఫెంట్ గేట్ ప్రాంతానికి చేరుకుంది. అక్కడి నుంచి చూలై హైరోడ్డు, అవధానం పాపయ్య రోడ్డు, చెల్లప్ప వీధుల మీదుగా రాత్రి అయనావరంలోని కాశీ విశ్వనాథుడి ఆలయానికి చేరుకుంది. మంగళవారం విల్లివాక్కం, తిరుముల్లైవాయల్, తిరువళ్లూరు మీదుగా సాగి ఈ నెల 27వ తేది సాయంత్రం 3 గంటలకు తిరుమల చేరుకుంటుంది. తిరుమలలో టీటీడీ అధికారులకు అప్పగించనున్నట్లు ఆర్ఆర్ గోపాల్ తెలిపారు. కాగా గొడుగుల ఊరేగింపు మార్గాల్లో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పోలీసులు బందోబస్తు ఏర్పాటుచేశారు.





గొడుగుల ఊరేగింపును ప్రారంభిస్తున్న ఉడిపి మఠాధిపతి విద్యాధీశ తీర్థ స్వామీజీ, ఆర్ఆర్ గోపాల్ తదితరులు - ఊరేగింపులో పాల్గొన్న అశేష భక్తజనం

### నేడు కులశేఖరపట్టిణంలో

## దసరా ఉత్సవాలు ప్రారంభం



ప్రత్యేక అలంకరణలో ముత్తారమ్మన్

అడయార్, సెప్టెంబరు 22 (ఆంధ్రజ్యోతి): తూత్తుకుడి జిల్లా కులశేఖరపట్టిణంలో ప్రతి యేటా దసరా ఉత్సవాలను అత్యంత వైభవంగా నిర్వహిస్తుంటారు. ఈ యేడాది కూడా ముత్తారమ్మన్ ఆలయంలో ఈ వేడుకలు మంగళవారం ధ్వజారోహణంతో ప్రారంభంకానున్నాయి. దేశంలో మైసూరు దసరా వేడుకల తర్వాత కులశేఖరపట్టిణం దసరా ఉత్సవాలు ప్రసిద్ధి చెందాయి. ఈ వేడుకలు ఈ నెల 23 ఉదయం 5.30 గంటలకు ధ్వజారోహణంతో ప్రారంభమవుతాయి. ఆ తర్వాత ధ్వజస్తంభానికి పూజలు, దీపారాధన చేస్తారు. ఆలయ పూజారి చేత భక్తులు కంకణాలు కట్టించుకుని, మొక్కులు తీర్చుకుంటారు. కాగా, ఈ వేడుకల్లో భాగంగా ఈ నెల 24 నుంచి అక్టోబరు ఒకటో తేదీ వరకు ప్రతి రోజూ ఉదయం 7.30, 9, 10.30, మధ్యాహ్నం 12, 1.30, సాయంత్రం 4.30, 6,7.30 గంటలకు ముత్తారమ్మన్‌కు ప్రత్యేక పూజలు, అభిషేకాలు చేస్తారు. అలాగే, ఈ వేడుకల్లో భాగంగా తొలిరోజైన మంగళవారం నుంచి అక్టోబరు ఒకటో తేదీ వరకు అమ్మవారు ప్రతి రోజూ ఒక్కో వాహనంలో ఊరేగుతారు. ఈ వేడుకలను చూసేందుకు రాష్ట్రం నలుమూలల నుంచి సుమారు 50 వేల మంది వస్తారని అంచనా వేస్తున్నారు. ముఖ్యంగా తిరునెల్వేలి, తూత్తుకుడి, కన్నియాకుమారి, తెన్‌కాశి జిల్లాల నుంచి భక్తులు భారీగా తరలివస్తారు. ఈ వేడుకల పదో రోజైన అక్టోబరు 2న మహిషా శూరసంహారం వేడుక నిర్వహిస్తారు. ఈ దసరా ఉత్సవాల సందర్భంగా ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా జిల్లా యంత్రాంగం, పోలీసులు కట్టుదిట్టమైన భద్రతా చర్యలు చేపట్టింది. అలాగే భక్తుల సౌకర్యార్థం మొబైల్ టాయిలెట్స్ తదితర సదుపాయాలను కల్పించింది.

### అధికారంలో భాగస్వామ్యం కోసం

# ఒత్తిడి చేస్తాం



● అధిక సీట్లివ్వాలని డీఎంకేని కోరతాం ● సీఎల్పీ నేత రాజేష్‌కుమార్

చెన్నై, సెప్టెంబరు 22 (ఆంధ్రజ్యోతి): వచ్చే యేడాది జరిగే అసెంబ్లీ ఎన్నికల్లో తమ పార్టీకి అధిక సీట్లు కేటాయించమని డీఎంకే అధిష్టానంపై ఒత్తిడి చేస్తామని కాంగ్రెస్ లెజిస్లేచర్ పార్టీ నాయకుడు రాజేష్‌కుమార్ మరోమారు ప్రకటించారు., అదే సమయంలో డీఎంకే ప్రభుత్వంలో అధికారంలో భాగస్వామ్యం కోసం కాంగ్రెస్ అధిష్టానంపై తీవ్ర ఒత్తిడి చేస్తామన్నారు. 2021లో జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో డీఎంకే కూటమిలో 25 నియోజకవర్గాలు మాత్రమే కేటాయించారు. అధికారంలో కాంగ్రెస్‌కు వాటా ఇచ్చేందుకు డీఎంకే ససేమిరా కుదరదని స్పష్టం చేసింది. నామినేటెడ్ పోస్టుల్లోనూ కాంగ్రెస్‌కు కీలకమైనవి రాలేదు. ప్రస్తుతం అసెంబ్లీ ఎన్నికలు సమీపిస్తుండటంతో ఈ సారి అధిక సీట్లు పొందాలని రాష్ట్ర కాంగ్రెస్ నేతలు భావిస్తున్నారు. ఈసారి అధికారంలో భాగస్వామ్యం కోరతామని రాజేష్‌కుమార్ కొద్ది వారాల క్రితం ప్రకటించి పార్టీలో కలకలం సృష్టించారు. అధికారంలో భాగస్వామ్యం కావాలని రాజేష్‌కుమార్ ప్రకటించడం ఆయన వ్యక్తిగత అభిప్రాయం మాత్రమేనని టీఎన్‌సీసీ అధ్యక్షుడు సెల్వపెరుంతగై పేర్కొన్నారు. అధికంగా సీట్లు పొందటం, అధికారంలో వాటా కోరటం అనే కీలకమైన అంశాలపై అధిష్టానవర్గమే నిర్ణయం తీసుకుంటుందన్నారు. ఈ నేపథ్యంలో సోమవారం సీఎల్పీ నేత రాజేష్‌కుమార్ మీడియాతో మాట్లాడుతూ 58 యేళ్లుగా రాష్ట్రంలో కాంగ్రెస్ అధికారంలో లేదని, అయినప్పటికీ రోజురోజుకూ పార్టీ బలం పుంజుకుంటూనే ఉందన్నారు. కాంగ్రెస్ అధికారంలోకి రావాలంటే డీఎంకే ప్రభుత్వంలో వాటా పొందాలని, కాంగ్రెస్ ఎమ్మెల్యేల్లో కొందరికి మంత్రి పదవులు దక్కితే ఆ పదవుల ద్వారా ప్రజలకు సేవలు చేసి మంచిపేరుతెచ్చుకుని అధికారంలోకి వచ్చే దిశగా ప్రచారం చేయవచ్చని ఆయన వివరించారు. రాష్ట్రంలో అధికారంలోని లేని పార్టీలు అభివృద్ధి చెందలేవని ఆయన పేర్కొన్నారు. ఈ సారి 25 సీట్లతో సరిపెట్టుకునే ప్రసక్తే లేదని, కనీసం 30కంటే ఎక్కువ సీట్లు కావాలని డీఎంకే అధిష్టానవర్గంపై ఒత్తిడి చేస్తామని రాజేష్‌కుమార్ తెలిపారు. తమ కూటమిలో చేరితే అధికారంలో భాగస్వామ్యం ఇస్తామంటూ టీవీకే నేత విజయ్ చేసిన ప్రకటనపై ఆయన మాట్లాడుతూ టీవీకేతో పొత్తుపెట్టుకునే విషయంపై జాతీయ నాయకుడు రాహుల్‌గాంధీ నిర్ణయం తీసుకుంటారని చెప్పారు.

## మేమూ ఎక్కువ సీట్లు డిమాండ్ చేస్తాం

● సీపీఐ రాష్ట్ర కార్యదర్శి వీరపాండియన్

ప్యారీస్, సెప్టెంబర్ 22 (ఆంధ్రజ్యోతి): వచ్చే ఏడాది జరిగే ఎన్నికల్లో డీఎంకే కూటమిలో ఉన్న తమ పార్టీకి అధిక సీట్లు కేటాయించాలని డిమాండ్ చేయనున్నట్లు సీపీఐ రాష్ట్ర కార్యదర్శి వీరపాండియన్ పేర్కొన్నారు. ఆయన సోమవారం విడుదల చేసిన ప్రకటనలో డీఎంకే కూటమిలో ప్రస్తుతం కాంగ్రెస్, ఉభయ కమ్యూనిస్టులు, డీపీఐ, ఎండీఎంకే, కొంగునాడు మక్కల్ దేశీయ కట్చి, ఇండియన్ యూనియన్ ముస్లిం లీగ్, మనిదనేయ మక్కల్ కట్చి ఉన్నాయని తెలిపారు. రాష్ట్రంలో ప్రస్తుతం కాంగ్రెస్ ఓటు బ్యాంకు పెరిగిందని, అందువల్ల 2026 అసెంబ్లీ ఎన్నికల్లో అదనంగా నియోజకవర్గాలు కేటాయించాల్సిందిగా రాష్ట్ర కాంగ్రెస్ నేతలు సీఎం స్టాలిన్‌ను డిమాండ్ చేస్తున్నారని ఆయన వివరించారు. సీపీఐ, సీపీఎం పార్టీలు కూడా అదనపు సీట్లు కోరేందుకు నిర్ణయించాయని, ఇది కూటమికి వ్యతిరేకం కాదని, ప్రజాస్వామ్యంలో రాజకీయ పార్టీలు అదనపు సీట్లు కోరడం సహజమేనని వీరపాండియన్ తన ప్రకటనలో తెలిపారు.

### విజయ్ రెచ్చిపోవడానికి

# బీజేపీయే కారణం

● స్పీకర్ అప్పావు ధ్వజం



తిరునల్వేలిలో మీడియాతో మాట్లాడుతున్న స్పీకర్

చెన్నై, సెప్టెంబరు 22 (ఆంధ్రజ్యోతి): 'తమిళగ వెట్రికళగం' నేత విజయ్ అహంకారంతో రెచ్చిపోవడానికి బీజేపీ అండదండలే కారణమని స్పీకర్ అప్పావు ధ్వజమెత్తారు. తిరునల్వేలిలో సోమవారం ఉదయం ఆయన మీడియాతో మాట్లాడుతూ.. విజయ్ రాజకీయ పరిపక్వత లేకుండా డీఎంకే అధ్యక్షుడు ముఖ్యమంత్రి స్టాలిన్‌ను ఏక వచనంతో సంబోధించడం గర్హనీయమన్నారు. విజయ్ ప్రచారంలో చేస్తున్న విమర్శలు, ఆరోపణలన్నీ అవాస్తవాలేనన్న విషయం ప్రజలందరికీ తెలుసునని, ఏదో సినిమాలో డైలాగులను కంఠస్థం చేసినట్లు పర్యటనల్లో కూడా డైలాగులను తప్పులతడకగా పలుకుతున్నారన్నారు. తమ ప్రత్యర్థి ప్రభుత్వాలపై దుమ్మెత్తిపోయడానికి కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం ఆయా రాష్ట్రాల్లో పార్టీలను ప్రారంభింపజేస్తోందని, ఆ కోవలోనే విజయ్ కూడా రాజకీయ పార్టీని ప్రారంభించినట్లు తనకు అనుమానం కలుగుతోందన్నారు. ప్రతిసభలోనూ ముఖ్యమంత్రి స్టాలిన్‌ను బెదిరింపు ధోరణిలో సంబోధిస్తుండటాన్ని బట్టే విజయ్ వెనుక బీజేపీ నేతలున్నట్లు సుస్పష్టమవుతోందన్నారు. ప్రధాని, ముఖ్యమంత్రి గురించి మాట్లాడేటప్పుడు ఆచితూచి వ్యవహరించాలన్న ఇంగిత జ్ఞానం కూడా విజయ్‌కి లేదని, ప్రొటోకాల్ విస్మరించి విరుచుకుపడుతున్నారని, ఈ మిడిసిపాటు ఆయనకు తగదని స్పీకర్ అప్పావు హితవు పలికారు. డీఎంకే పాలకులు టీవీకేకు భయపడుతున్నారంటూ విజయ్ అసత్య ఆరోపణలు చేయడం గర్హనీయమని, అధికారంలో ఉన్నా లేకపోయినా డీఎంకే ఎవరికీ తలొగ్గదన్న విషయాన్ని ఆయన గ్రహించాలన్నారు. 'తలైవా' చిత్రం సమస్యల పరిష్కారం కోసం మూడు రోజులపాటు కొడనాడులో పడిగాపులు పడి అప్పటి ముఖ్యమంత్రి పాదాలపై పడిన విషయాన్ని విజయ్ గుర్తు పెట్టుకోవాలన్నారు. జీఎస్టీ తగ్గింపు వల్ల ప్రజలకు రూ.2.5 కోట్ల మేరకు రాయితీలు లభించడమే కాకుండా పొదుపు కూడా పెరుగుతుందని ప్రధాని మోదీ చెబుతుండటం విడ్డూరంగా ఉందని, అదే నిజమయితే జీఎస్టీ అమలులో ఉన్న ఈ పదేళ్లు రూ.20లక్షల కోట్లను ఎక్కడ భద్రపరిచారో చెప్పాలని అప్పావు డిమాండ్ చేశారు. రాష్ట్రానికి నిధులు విడుదల చేయకుండా సవతి తల్లి ప్రేమను ప్రదర్శించడం మోదీ ప్రభుత్వం ఘనత అని ఆయన విమర్శించారు.

# పల్లెల్లో వైద్యానికి ప్రాధాన్యం

● 1231 మంది నర్సుల నియామకం ● ఉత్తర్వులు అందజేసిన సీఎం స్టాలిన్




ఎంపికైన నర్సులకు కలైవానర్ అరంగంలో నియామక ఉత్తర్వులు అందజేస్తున్న సీఎం స్టాలిన్

చెన్నై, సెప్టెంబరు 22 (ఆంధ్రజ్యోతి): గ్రామీణ ప్రజల ఆరోగ్యానికి పెద్ద పీట వేస్తామని ముఖ్యమంత్రి స్టాలిన్ పేర్కొన్నారు. స్థానిక చేపాక్‌లోని కలైవానర్ అరంగంలో వైద్య ప్రజారోగ్యశాఖ ఆధ్వర్యంలో సోమవారం ఉదయం జరిగిన కార్యక్రమంలో ప్రభుత్వ నర్సింగ్ ట్రైనింగ్ స్కూళ్లలో శిక్షణ పొందిన 1231 మంది గ్రామీణ నర్సులకు రాష్ట్ర ముఖ్యమంత్రి స్టాలిన్ నియామక ఉత్తర్వులు అందజేశారు. ఈ సందర్భంగా సీఎం మాట్లాడుతూ త్వరలో గ్రామీణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో, ఉప కేంద్రాల్లో ఖాళీగా ఉన్న నర్సుల పోస్టులను భర్తీ చేస్తామని తెలిపారు. గ్రామీణ నర్సులు మాతా శిశు సంక్షేమ శాఖ సంబంధించిన సేవలు, రోగ నిరోధక టీకాలు వేయడం, బడిపిల్లలకు టీకా వేసే కార్యక్రమాలు నిర్వహిస్తారని సీఎం తెలిపారు. సుప్రీంకోర్టు స్టే కారణంగా కొన్నేళ్లపాటు ఈ నియామకాలు జరుగలేదని, ప్రస్తుతం స్టే తొలగించడంతో జాప్యం చేయకుండా గ్రామీణ నర్సులకు నియామక ఉత్తర్వులు అందజేశామన్నారు., ఈ కార్యక్రమానికి హాజరైన ప్రభుత్వ వైద్యుల సంఘం, వైద్య సిబ్బంది సంఘం, నర్సుల సంఘం నాయకులు, ప్రతినిధులు ముఖ్యమంత్రి స్టాలిన్‌ని కలిసి ధన్యవాదాలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో మంత్రులు ఎం.సుబ్రమణ్యం, పీకే శేఖర్‌బాబు, మేయర్ ప్రియ, ఆరోగ్యశాఖ ముఖ్య కార్యదర్శి పి.సెంథిల్‌కుమార్, జాతీయ ఆరోగ్య సంస్థ డైరెక్టర్ అరుణ్ తంబురాజ్, ప్రజారోగ్యం రోగనిరోధక మందుల విభాగం సంచాలకులు డాక్టర్ ఎ. సోమసుందరం తదితరులు పాల్గొన్నారు.

### 13 మంది అసిస్టెంట్ డైరెక్టర్ల నియామకం

తమిళ భాషాభివృద్ధి శాఖ ఆధ్వర్యంలో సచివాలయంలో జరిగిన మరొక కార్యక్రమంలో ప్రభుత్వ సిబ్బంది ఎంపిక సంస్థ ద్వారా అసిస్టెంట్ డైరెక్టర్ పోస్టులకు ఎంపికైన 13 మంది ముఖ్యమంత్రి స్టాలిన్ నియామక పత్రాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో మంత్రి ఎంపీ సామినాదన్, తమిళభాషాభివృద్ధి సమాచార శాఖ కార్యదర్శి వి. రాజారామన్, తమిళభాషాభివృద్ధి సంస్థ సంచాలకులు ఎన్. అరుళ్ తదితరులు పాల్గొన్నారు.

### గోతిలో పడి మృతి చెందిన వారి కుటుంబాలకు సీఎం సాయం

సేలం జిల్లా భైరోజీ అగ్రహారం కురూప్ గ్రామంలో ఆదివారం అరసంపాళయం కొండదిగువ వాననీటి గోతిలో పడి సుబ్రమణ్యం కుమారులు నిశాంత్ (23), ప్రశాంత్ (19) మృతి చెందటం పట్ల సీఎం స్టాలిన్ సంతాపం ప్రకటించారు. తలా రూ.3లక్షల చొప్పున వారి కుటుంబానికి ఆర్థికసాయం అందించనున్నట్లు ఓ ప్రకటనలో ఆయన పేర్కొన్నారు.

# 25న 'విద్యలో తమిళనాడు అగ్రస్థానం' వేడుకలు

● హాజరుకానున్న తెలంగాణ సీఎం రేవంత్ రెడ్డి



మీడియాతో మాట్లాడుతున్న ప్రభుత్వ సమాచార కార్యదర్శి అముద

చెన్నై, సెప్టెంబరు 22 (ఆంధ్రజ్యోతి): విద్యారంగంలో రాష్ట్ర ప్రభుత్వం సాధించిన విజయాలను, ప్రగతిని తెలియజేసేలా ఈ నెల 25న 'విద్యలో తమిళనాడు అగ్రస్థానం' పేరుతో ప్రత్యేక వేడుకలు జరుపనున్నామని ప్రభుత్వ సమాచార కార్యదర్శి, సీనియర్ ఐఏఎస్ అధికారి అముద తెలిపారు. సోమవారం ఉదయం నగరంలో మీడియా సమావేశంలో ఆమె మాట్లాడుతూ.. 'నాన్ ముదల్వన్', 'తమిళపుదల్వన్', 'పుదుమైపెణ్' తదితర పథకాల ద్వారా విద్యారంగంలో ప్రభుత్వం సాధించిన విజయాలను తెలియజేసేలా ఈ వేడుకలు జరుగుతాయన్నారు. 25 సాయంత్రం నెహ్రూ ఇండోర్ స్టేడియంలో జరుగనున్న ఈ వేడుకలకు తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ముఖ్య అతిథిగా హాజరవుతారని తెలిపారు. ఈ యేడాది 2.57 లక్షల మంది విద్యార్థులు పుదుమైపెణ్, తమిళ్‌పుదల్వన్ పథకాల ద్వారా లబ్ధిపొందిన సందర్భంగా ప్రత్యేక వేడుకలు జరుగుతాయని చెప్పారు. నాన్ ముదల్వన్ పథకం ద్వారా 14.60 వేల మంది లబ్ధిపొందగా, 41 లక్షలమంది నైపుణ్యతా సర్టిఫికెట్లు పొందారని తెలిపారు. సీఎం అల్పాహార పథకం ద్వారా 20.59 లక్షల మంది బడిపిల్లలు, తమిళ్ పుదల్వన్ పథకం ద్వారా 3.92 లక్షలమంది లబ్ధి పొందారని ఆమె వివరించారు.

## అన్నాడీఎంకే కార్యాలయాన్ని ఢిల్లీకి మార్చిన ఈపీఎస్

● డీఎంకే ఎంపీ కనిమొళి ఎద్దేవా

ప్యారీస్, సెప్టెంబర్ 22 (ఆంధ్రజ్యోతి): అన్నాడీఎంకే కార్యాలయాన్ని ఆ పార్టీ ప్రధాన కార్యదర్శి ఎడప్పాడి పళనిస్వామి ఢిల్లీకి బదిలీ చేశారని డీఎంకే ఎంపీ కనిమొళి ఎద్దేవాచేశారు. తూత్తుకుడి జిల్లా తిరుచెందూర్ సమీపంలోని ఉడన్‌కుడిలో ఆదివారం సాయంత్రం నిర్వహించిన డీఎంకే బహిరంగ సభలో కనిమొళి మాట్లాడుతూ.. తమిళనాడుకు ద్రోహం తలపెట్టిన మతవాద బీజేపీతో పొత్తుకుదుర్చుకున్న ఈపీఎస్ పార్టీ కార్యాలయాన్ని ఢిల్లీలోని బీజేపీ పెద్దల చేతుల్లో పెట్టారని విమర్శించారు. ప్రపంచ దేశాల్లో పర్యటిస్తున్న ప్రధాని నరేంద్ర మోదీకి ఏ దేశంతోనూ సత్సంబంధాలు లేవని, అందువల్లే నేపాల్, చైనా, శ్రీలంక దేశాలు భారత్‌ను వ్యతిరేకిస్తున్నాయన్నారు. రాష్ట్రంలో ముఖ్యమంత్రి స్టాలిన్ మంచి పథకాలను అమలుచేస్తున్నారని, ముఖ్యంగా మహిళలు ఆర్థికంగా నిలదొక్కుకోవాలన్న దృక్పథంతో వారిని ప్రభుత్వం ప్రోత్సహిస్తోందని తెలిపారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర మంత్రి అనితా రాధాకృష్ణన్, డీఎంకే నిర్వాహకులు పాల్గొన్నారు.

## సమాచార దర్శిని

### 25న పర్యాటకశాఖలో ఉద్యోగాలకు ఇంటర్వ్యూ

ప్యారీస్, సెప్టెంబర్ 22 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రప్రభుత్వ పర్యాటకశాఖలో సహాయక అధికారి పోస్టులకు ఈ నెల 25న ఇంటర్వ్యూ నిర్వహించనున్నట్లు తమిళనాడు పబ్లిక్ సర్వీస్ కమిషన్ (టీఎన్‌పీఎస్సీ) ప్రకటించింది. బ్రాడ్‌వే బస్‌టెర్మినల్ సమీపంలో ఉన్న టీఎన్‌పీఎస్సీ కార్యాలయంలో పర్యాటకశాఖలో సహాయక అధికారుల పోస్టుల రాతపరీక్షల్లో పాల్గొని ఉత్తీర్ణులైన అభ్యర్థులు ఒరిజినల్ ధ్రువీకరణపత్రాలతో ఇంటర్వ్యూకు హాజరుకావాలని టీఎన్‌పీఎస్సీ కార్యదర్శి గోపాల సుందరరాజ్ తెలిపారు. ఇంటర్వ్యూలో పాల్గొనాల్సిన అభ్యర్థులు www.tnpsc.gov.in అనే వెబ్‌సైట్ నుండి కాల్ లెటర్స్ డౌన్‌లోడ్ చేసుకోవచ్చు.

### 30 వరకు టూరిజం అవార్డులకు దరఖాస్తుల స్వీకరణ

ప్యారీస్, సెప్టెంబర్ 22 (ఆంధ్రజ్యోతి): తమిళనాడు టూరిజం అవార్డులకు ఈ నెల 30వ తేదీ వరకు దరఖాస్తు చేయవచ్చని చెన్నై జిల్లా కలెక్టర్ రష్మీ సిద్ధార్థ్ జగడే ఓ ప్రకటనలో తెలిపారు. 2021-22వ సంవత్సరం అసెంబ్లీ సమావేశాల్లో పర్యాటకశాఖ అభివృద్ధి కోసం ప్రభుత్వం 30 కొత్త ప్రకటనలు చేశారు. అందులో ప్రపంచ పర్యాటకదినం సందర్భంగా ప్రతిఏటా పర్యాటక శాఖలో ఉత్తమసేవలందిస్తున్న వారిని ఎంపిక చేసి అవార్డులు అందజేస్తారు. ఈ అవార్డుల కోసం tn tourism awards అనే వెబ్‌సైట్ నుండి డౌన్‌లోడ్ చేసుకున్న దరఖాస్తులను పూర్తిచేసి కలెక్టర్ కార్యాలయం, తమిళనాడు టూరిజం డెవెలెప్మెంట్ కార్పొరేషన్ (టీటీడీసీ) కార్యాలయాల్లో ఈ నెల 30వ తేదీ సాయంత్రం 5 గంటల్లోపు సమర్పించాల్సివుంటుంది.

### ట్రాఫిక్ పోలీసులు 'సెల్యూట్' చేయక్కర్లేదు

ప్యారీస్, సెప్టెంబర్ 22 (ఆంధ్రజ్యోతి): భద్రతా విధులో, ప్రముఖుల కాన్వాయ్‌లో పాల్గొనే ట్రాఫిక్ పోలీసులు అధికారులకు సెల్యూట్ చేయాల్సిన అవసరం లేదని, అటెన్షన్‌లో నిలబడితే చాలని చెన్నై పోలీసు కమిషనర్ అరుణ్ ఉత్తర్వులు జారీచేశారు. వెపేరిలోని పోలీసు కమిషనర్ కార్యాలయం సోమవారం విడుదల చేసిన ప్రకటనలో, నగరంలో ప్రధాన రోడ్ల కూడలిలో ఉన్న ట్రాఫిక్ సిగ్నల్స్ వద్ద విధులు నిర్వహించే ట్రాఫిక్ విభాగం పోలీసులు వాహనాల రాకపోకలు సాఫీగా జరిగేలా చూడాలన్నారు. ఎస్‌ఐ ర్యాంకు కంటే తక్కువ పదవుల్లో ఉన్న పోలీసు అధికారులు ప్రయాణించే సమయంలో సెల్యూట్ చేయాల్సిన అవసరం లేదని కమిషనర్ ఆదేశించారు.

### పెరిగిన కృష్ణా జలాల రాక

పెరంబూర్, సెప్టెంబరు 22 (ఆంధ్రజ్యోతి): ఆంధ్ర-తమిళనాడు సరిహద్దు ప్రాంతాల్లో కురుస్తున్న వర్షాల కారణంగా రాష్ట్రానికి కృష్ణా జలాల రాక పెరిగింది. రాజధాని నగరం చెన్నై ప్రజల తాగునీటి అవసరాలకు కృష్ణా నదీజలాల ఒప్పందంలో భాగంగా, రాష్ట్రానికి సాయిగంగ కాలువ ద్వారా కృష్ణా జలాలు విడుదల చేస్తున్నారు. ఆంధ్ర రాష్ట్రం కండలేరు డ్యాం నుంచి విడుదల చేస్తున్న నీరు, ఆంధ్రలో 152 కి.మీ పయనించి, రాష్ట్ర సరిహద్దు ప్రాంతమైన జీరో పాయింట్ మీదుగా పూండి సత్యమూర్తిసాగర్ జలాశయానికి చేరుకుంటున్నాయి. ఈ క్రమంలో కొద్దిరోజులుగా ఆంధ్ర-తమిళనాడు సరిహద్దు ప్రాంతాలైన పుడుకుప్పం, సత్యవేడు సహా ప్రాంతాల్లో వర్షాలు కురుస్తుండడంతో రాష్ట్ర సరిహద్దు ప్రాంతమైన జీరో పాయింట్‌కు 420 ఘనపుటడుగుల మేర వస్తున్న నీరు ఆదివారం ఉదయం 606 ఘనపుటడుగులకు పెరిగిందని ప్రజాపనుల శాఖ అధికారులు తెలిపారు.

### నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

ప్యారీస్, సెప్టెంబర్ 22 (ఆంధ్రజ్యోతి): విద్యుత్ మార్గాల్లో మరమ్మతుల కారణంగా దిగువ ప్రాంతాల్లో మంగళవారం ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని విద్యుత్ బోర్డు (టీఎన్‌ఈబీ) ప్రకటించింది.

చెట్‌పేట్: మెక్‌నికల్స్ రోడ్డు, నౌరోజీరోడ్డు, గురుస్వామిరోడ్డు, పూందమల్లి హైరోడ్డు, ముత్తయ్యవీధి, వెంకటాచలపతి వీధి, సుబ్బరాయన్ వీధి, యాదవ వీధి, తూర్పు మాడవీధి, వళ్లువార్ వీధి, సభాపతివీధి, వీవీ కోవిల్ వీధి, రాజరత్నంరోడ్డు, న్యూ ఆవడి రోడ్డు, ఆర్‌బీఐ క్వార్టర్స్ తిరువీధియమ్మన్‌వీధి, వీరరాఘవన్‌వీధి.

నుంగంబాక్కం: కాలేజీరోడ్డు, మూర్స్ రోడ్డు, నుంగంబాక్కం హైరోడ్డు, కేఎన్‌కేరోడ్డు, వాలస్ గార్డెన్ 1 నుండి 3 వీధులు, రెట్లాండ్ గేట్ 1 నుంచి 6 వీధులు, సుబ్బారావు అవెన్యూ 1 నుంచి 3 వీధులు, అండర్సన్‌వీధి, హాడోస్ 1,2 వీధులు, నవాబ్ హబియుల్లా 1 నుంచి 5 వీధులు.

ఆళ్వార్ తిరునగర్: ఆర్కేనగర్ మెయిన్ రోడ్డు, ఇందిరానగర్ రోడ్డు, గంగైయమ్మన్ కోవిల్‌వీధి, ఠాకూర్‌రోడ్డు, సిండికేట్ కాలనీ, బాలాజీ నగర్, తిరుమలైనగర్

తెల్లిగంగానగర్: ఆండాళ్ నగర్ 1వ ప్రధానవీధి, ఎక్స్‌టెంషన్ 1 నుండి 5క్రాస్ వీధులు, కృష్ణానగర్ 1 నుంచి 4వీధులు, బృందావన్ 1 నుంచి 7వ వీధులు, సదర్న్ షెల్టర్, నరుముఖ అపార్ట్‌మెంట్.

చిన్మయానగర్: సాయినగర్, కాళికమ్మన్ వీధి, నటేశన్‌నగర్, పచ్చయమ్మన్ కోవిల్ వీధి, ఇళంగోనగర్, రాజీవ్‌గాంధీరోడ్డు, జైన్ అపార్ట్‌మెంట్, కన్నగిరోడ్డు, కృష్ణానగర్ 4వ వీధి, బాలాజీనగర్, స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా కాలనీ, పీపీ కాలనీ, మేట్టుకుప్పం, భువనేశ్వరినగర్.

### రూ.500 కోట్లతో
# అన్నావర్సిటీ అభివృద్ధి


శిలాఫలకాన్ని ఆవిష్కరిస్తున్న ఉన్నత విద్యాశాఖ మంత్రి కోవి చెళియన్

ప్యారీస్, సెప్టెంబర్ 22 (ఆంధ్రజ్యోతి): స్థానిక గిండిలోని అన్నా వర్శిటీని రూ.500 కోట్లతో అభివృద్ధి చేయనున్నట్లు రాష్ట్ర విద్యాశాఖ మంత్రి కోవి.చెళియన్ పేర్కొన్నారు. సోమవారం ప్రభుత్వ ఇంజనీరింగ్ కాలేజీ ప్రాంగణం వద్ద పూర్వ విద్యార్థుల సంఘం శతవార్షికోత్సవాల సందర్భంగా ఏర్పాటైన శిలాఫలకాన్ని ఆవిష్కరించిన అనంతరం ఆయన మీడియాతో మాట్లాడుతూ, 1944లో ఇంజనీరింగ్ కోర్సులో మొదటిసారిగా ఓ మహిళ చేరిన ఘనత గిండి ఇంజనీరింగ్ కళాశాలకు ఉందని, ఉన్నత విద్యారంగంలో పలు రికార్డులు నెలకొల్పుతున్న అన్నావిశ్వవిద్యాలయాన్ని రూ.500 కోట్లతో అభివృద్ధి పరిచేందుకు ప్రభుత్వం త్వరలోనే జీవో జారీచేస్తుందని మంత్రి తెలిపారు.

### లైంగిక వేధింపులతో.. ఇంజనీరింగ్ విద్యార్థి ఆత్మహత్య

● ఐదుగురి అరెస్టు

అడయార్, సెప్టెంబరు 22 (ఆంధ్రజ్యోతి): పుదుక్కోట జిల్లా మండైయూరు సమీపంలో అన్నా విశ్వవిద్యాలయంలో తృతీయ సంవత్సరం బీటెక్ చదువుతున్న మారీశ్వరన్ (21) అనే విద్యార్థి రైలుకిందపడి ఆత్మహత్య చేసుకున్నాడు. ఫేస్‌బుక్‌లో పరిచయమైన మరో విద్యార్థి, అతడి స్నేహితులు కలిసి లైంగికంగా వేధిస్తున్నారని, వీటిని భరించలేకే తాను ఆత్మహత్య చేసుకున్నట్టు తన డైరీలో రాసిపెట్టాడు. ఈ డైరీ ఆధారంగా పాలిటెక్నిక్ విద్యార్థి సహా ఐదుగురిని పోలీసులు అరెస్టు చేశారు. పోలీసుల కథనం మేరకు.. విరుదునగర్ జిల్లాకు చెందిన మారీశ్వరన్ తిరుచ్చిలోని అన్నా వర్సిటీ క్యాంపస్‌లో బీటెక్ చదువుతున్నాడు. ఈ విద్యార్థికి ఫేస్‌బుక్ ద్వారా పుదుక్కోట జిల్లా మండైయూరుకు చెందిన పాలిటెక్నిక్ విద్యార్థితో పరిచయం ఏర్పడింది. ఆ తర్వాత మారీశ్వరన్ పలుమార్లు తిరుచ్చి నుంచి పుదుక్కోట వెళ్ళివచ్చాడు. ఈ క్రమంలో రెండు రోజుల క్రితం మండైయూరు రైల్వే గేటు వద్ద రైలుకిందపడి ఆత్మహత్య చేసుకున్నాడు. దీనిపై రైల్వే పోలీసులు కేసు నమోదు చేసి విచారణ చేపట్టారు. మారీశ్వరన్ గదిని తనిఖీ చేయగా, డైరీ, మొబైల్ ఫోన్ స్వాధీనం చేసుకున్నారు. పుదుక్కోటకు చెందిన పాలిటెక్నిక్ విద్యార్థి, అతడి స్నేహితులు కలిసి లైంగికంగా వేధించడంతో పాటు బంగారు గొలుసు, బ్యాంకు ఖాతాలోని డబ్బు బలవంతంగా తీసుకున్నారని, ఈ వేధింపులను భరించలేకే ఆత్మహత్య చేసుకున్నట్టు డైరీలో రాశాడు. దీంతో పాలిటెక్నిక్ విద్యార్థి ఇళంగోవన్ (20), అతని స్నేహితులు పాండీశ్వరన్ పవిత్రన్ (20), ముత్తురాజా (21), అంటోనీ సంజయ్ (22)తో సహా ఐదుగురిని అరెస్టు చేశారు.

### 22 కిలోల గంజాయితో ముగ్గురి అరెస్ట్

ప్యారీస్, సెప్టెంబర్ 22 (ఆంధ్రజ్యోతి): స్థానిక అంబత్తూరులో చట్టవిరుద్ధంగా గంజాయి విక్రయించిన ముగ్గురు యువకులను అదుపులోకి తీసుకుని వారి నుంచి 22 కిలోల గంజాయిని పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. ఆవడి పోలీస్ కమిషనర్ శంకర్ ఉత్తర్వుల మేరకు అంబత్తూరు బస్టాండ్ సమీపంలో ఎక్సైజ్ పోలీసులు శనివారం సాయంత్రం ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. ఆ ప్రాంతంలో అనుమానాస్పదంగా నిలబడి ఉన్న ముగ్గురు యువకులను అదుపులోకి తీసుకుని వారి సంచులను తనిఖీ చేసి అందులో 22 గంజాయి గుర్తించి స్వాధీనం చేసుకున్నారు. విచారణలో వారు త్రిపుర రాష్ట్రానికి చెందిన సందీప్ (42), సోయల్‌రాణా (22), ప్రచండదాస్ (19)అని తెలిసింది. వారిని మేజిస్ట్రేట్ కోర్టులో హాజరుపరిచి రిమాండ్‌కు తరలించారు.

### వాతావరణ కేంద్రం, జీఎస్టీ కార్యాలయానికి బాంబు బెదిరింపు

చెన్నై, సెప్టెంబరు 22 (ఆంధ్రజ్యోతి): నగరంలోని వాతావరణ పరిశోధన కేంద్రం, జీఎస్టీ కార్యాలయానికి బాంబు బెదిరింపు వచ్చింది. నుంగంబాక్కంలోని జీఎస్టీ కార్యాలయానికి ఉప ముఖ్యమంత్రి ఉదయనిధి పేరుతో, కాలేజ్ రోడ్డులో వున్న వాతావరణ పరిశోధన కేంద్రానికి పంజాబ్ ముఖ్యమంత్రి భగవంత్ మాన్ పేరుతోనూ ఈ మెయిల్ బెదిరింపు వచ్చింది. రెండు కార్యాలయాల ఉన్నతాధికారుల నుంచి ఈ సమాచారం అందుకున్న పోలీసులు బాంబ్ స్క్వాడ్, డాగ్ స్క్వాడ్‌తో ఆ రెండు చోట్లా ముమ్మరంగా తనిఖీలు చేశారు. చివరకు అవి ఉత్తుత్తి బాంబు బెదిరింపులేనని తేలడంతో ఆ కార్యాలయాలో పనిచేస్తున్న ఉద్యోగులు ఊరట చెందారు. సైబర్ క్రైం పోలీసులు కేసు నమోదు చేసుకుని బెదిరింపులు పంపిన దుండగుల కోసం గాలిస్తున్నారు.

### సెల్‌ఫోన్ చోరీ కేసులో ముగ్గురి అరెస్ట్

తిరుత్తణి, సెప్టెంబర్ 22 (ఆంధ్రజ్యోతి): వరుస సెల్‌ఫోన్ చోరీలకు పాల్పడుతున్న ముగ్గురిని పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. వివరాలిలా.. తిరువళ్లూరు జిల్లా ఆర్కేపేట సమీపంలోని కాట్టూర్ గ్రామానికి చెందిన లారీ డ్రైవర్ వర్మ (45) తన కుటుంబంతో కలిసి ఆ గ్రామంలో నివాసిస్తున్నారు. ఆదివారం ఉదయం తన లారీలో షోళింగర్‌కు అరటిపండ్ల లోడుతో వర్మ బయలుదేరాడు. అరటి పండ్లు అన్‌లోడ్ చేసి సోమవారం తెల్లవారుజామున పళ్లిపట్టు సమీపంలోని వెంగంపేట అటవీ ప్రాంతానికి చేరుకున్న సమయంలో బైక్‌పై వెంబడించిన నలుగురు యువకులు లారీని ఆపి అతడిపై దాడి చేసి, సెల్‌ఫోన్ దొంగిలించి పరారయ్యారు. దీనిపై లారీ డ్రైవర్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. రంగంలోకి దిగిన పోలీసులు ఆ ప్రాంతంలో ఉన్న సీసీ ఫుటేజీ ఆధారంగా నిందితుల్లో ముగ్గురిని అరెస్టు చేశారు. విచారణలో వారు ఆంధ్రప్రదేశ్ వెంకటగిరికి చెందిన భానుప్రకాష్ (25), పొదటూర్‌పేటకు చెందిన 17యేళ్ల ఓ బాలుడు, వాణివిలాస్‌పురానికి చెందిన వెంకటేశన్ కుమారుడు స్వామియప్పన్ (18)గా గుర్తించారు. వీరు గత కొన్ని నెలలుగా రాత్రివేళల్లో బైపాస్ రోడ్లపై ప్రయాణించేవారిపై దాడి చేసి వారివద్ద సెల్‌ఫోన్లు అపహరించినట్టు తెలిసింది. పోలీసులు వీరిపై కేసు నమోదు చేసి కోర్టు ఉత్తర్వుల మేరకు రిమాండ్‌కు తరలించి, పరారైన నాలుగో వ్యక్తి కోసం గాలింపు చర్యలు చేపట్టారు.

### కొళత్తూరులో బాలుడి దారుణహత్య

● విద్యార్థి సహా ఆరుగురి అరెస్టు

చెన్నై, సెప్టెంబరు 22 (ఆంధ్రజ్యోతి): స్థానిక కొళత్తూరు మురుగన్‌నగర్‌లో నివసిస్తున్న సిటీ బస్ కండెక్టర్ వీరమణి కుమారుడు హర్షవర్ధన్ (17)ను కాలేజీ విద్యార్థి సహా ఏడుగురు వేటకొడవళ్లు, కర్రలతో కొట్టి దారుణంగా హతమార్చారు. కొద్ది రోజుల క్రితం హర్షవర్ధన్ తన స్నేహితుడితో కలిసి తాత్తాంకుప్పంలో బైకులో వెళ్తుండగా ధనుష్ అనే యువకుడు ఆపి బైకు వేగంగా నడపవద్దని చెప్పి తలపై మొట్టికాయలు వేశారు. ఆ తర్వాత హర్షవర్ధన్ ఇంటికి తిరిగి వెళ్ళాడు. ఈ నేపథ్యంలో ఆదివారం ముగ్గురు స్నేహితులతో కలిసి బైకులో తాత్తాంకుప్పం ప్రాంతానికి హర్షవర్ధన్ వెళ్ళాడు. ధనుష్ అతడి స్నేహితులు హర్షవర్ధన్‌ను వెక్కిరించారు. దీనితో హర్షవర్ధన్, అతడి స్నేహితుడు, ధనుష్, అతడి స్నేహితులో గొడవ పడ్డారు. దాని తరువాత హర్షవర్ధన్ తన స్నేహితులతో బైకులో ఇంటికి తిరిగి వెళ్తుండగా ధనుష్ అతడి స్నేహితులు వేటకొడవళ్లు, కర్రలతో వెంబడించి, చుట్టుముట్టారు. ధనుష్, అతడి స్నేహితులతో కలిసి హర్షవర్ధన్‌పై దాడికి దిగారు. దీంతో భయపడిపోయిన అతడి స్నేహితులు ముగ్గురూ పరారయ్యారు. ఒంటరిగా చిక్కిన హర్షవర్ధన్‌పై ధనుష్, అతడి స్నేహితులు వేటకొడవళ్లతో దాడి చేసి హతమార్చారు. ఈ సమాచారం అందుకుని రాజమంగళం పోలీసులు కేసు నమోదు చేసుకుని కాలేజీ విద్యార్థి తరుణ్ సహా ఆరుగురిని అరెస్టు చేశారు. పరారీలో ఉన్న ధనుష్ ఆచూకీ కోసం గాలిస్తున్నారు.

## విజయ్‌కు అన్నాడీఎంకే చరిత్ర తెలియదు

● మాజీమంత్రి ఉదయ్‌కుమార్


మీడియాతో మాట్లాడుతున్న ఆర్బీ ఉదయ్‌కుమార్

ప్యారీస్, సెప్టెంబర్ 22 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రాన్ని దాదాపు 30యేళ్లపాటు సుభిక్షంగా పరిపాలించి అన్ని రంగాలను అభివృద్ధిపరిచిన అన్నాడీఎంకే చరిత్ర గురించి తమిళగ వెట్రి కళగం (టీవీకే) అధ్యక్షుడు విజయ్ తెలుసుకోవాలని మాజీమంత్రి ఆర్బీ ఉదయ్‌కుమార్ సూచించారు. మదురైలో ఆదివారం అన్నాడీఎంకే ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన పార్టీ సమావేశంలో పాల్గొన్న ఉదయ్‌కుమార్ మీడియాతో మాట్లాడారు. రాజకీయాల్లో రాణించడం మాటలతో చెప్పుకున్నంత సులువుకాదని అయితే ఈ వాస్తవం తెలియక విజయ్ సభల్లో సినీ డైలాగులతో యువతను ఆకట్టుకుంటున్నారన్నారు. దాదాపు 30యేళ్ల పాటు రాష్ట్రానికి పాలించిన అన్నాడీఎంకే, ప్రస్తుతం అధికారంలో ఉన్న డీఎంకే మధ్యే పోటీ ఉంటుందని ఆయన అన్నారు. ఎన్నికలు, రాజకీయాలపై అనుభవం లేని విజయ్ అధికారంలోకి వస్తామని కంటున్న కల నెరవేరబోదని ఉదయ్‌కుమార్ అభిప్రాయం వ్యక్తం చేశారు.

### లాకప్‌డెత్ కేసులో సవరించిన ఛార్జీషీటు

ప్యారీస్, సెప్టెంబర్ 22 (ఆంధ్రజ్యోతి): శివగంగ జిల్లా మడప్పురం ఆలయ వాచ్‌మన్ అజిత్‌కుమార్ హత్యకేసులో సవరించిన ఛార్జీషీటును సీబీఐ అధికారులు న్యాయస్థానంలో దాఖలు చేశారు. మడప్పురం ఆలయ ప్రాంగణంలో నగలు చోరీ వ్యవహారంలో ప్రత్యేక విభాగం పోలీసులు అజిత్‌కుమార్‌ను విచారణకు తీసుకెళ్లి హత్యచేసారని కేసు నమోదైంది. కోర్టు ఉత్తర్వుల మేరకు గత నెల 20వ తేదీ సీబీఐ తయారుచేసిన ఛార్జిషీటును న్యాయస్థానంలో ప్రవేశపెట్టారు. అందులో పోలీసువాహన డ్రైవర్‌ను ఆరో ముద్దాయిగా చేర్చినందున ఛార్జిషీటు సవరించాలని న్యాయస్థానం ఆదేశించింది. ఈ రకంగా సవరించిన ఛార్జిషీటును మదురై జిల్లా కోర్టు న్యాయమూర్తి చల్లపాండి ముందు శుక్రవారం దాఖలు చేసినట్లు సీబీఐ అధికారులు తెలిపారు. ఈ నేపథ్యంలో, ఈ కేసు తదుపరి విచారణ ఈ నెల 23కు వాయిదా వేస్తూ న్యాయస్థానం ఉత్తర్వులు జారీచేసింది.

### ప్రేమ వ్యవహారంలో యువకుడి దారుణహత్య


మణికంఠన్ (ఫైల్‌ఫొటో)

చెన్నై, సెప్టెంబరు 22 (ఆంధ్రజ్యోతి): తూత్తుకుడి జిల్లా తిరుచెందూరు తోప్పూరు ప్రాంతంలో ప్రేమ వ్యవహారం కారణంగా సోమవారం మధ్యాహ్నం బైకులో వెళుతున్న మణికంఠన్ (30) అనే యువకుడిని ముగ్గురు వ్యక్తులు వేటకొడవళ్లతో దాడి చేసి హతమార్చారు. ఎలక్ట్రీషియన్‌గా పనిచేస్తున్న మణికంఠన్ దసరా వేడుకల సందర్భంగా మాల ధరించాడు. సోమవారం మధ్యాహ్నం తోప్పూరు వద్ద బైకులో వెళ్తుండగా ముగ్గురు వ్యక్తులు కత్తులు, వేటకొడవళ్లతో దాడి జరిపారు. ఈ సంఘటనలో మణికంఠన్ తీవ్రంగా గాయపడి అక్కడికక్కడే మరణించాడు. తిరుచెందూరు తాలూకా పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు ప్రారంభించారు. ఈ హత్యకు ప్రేమ వ్యవహారమని, మణికంఠన్ ప్రేమించిన యువతి సోదరుడు, అతడి స్నేహితులు ఇద్దరు కలిసి ఈ హత్యకు పాల్పడినట్లు కనుగొన్నారు. పరారీలో ఉన్న వారి ఆచూకీ కోసం పోలీసులు తీవ్రంగా గాలిస్తున్నారు.

### చదువు తల్లి క్షేత్రంలో నవరాత్రి ఉత్సవాలు ప్రారంభం


భక్తిగీతాలు ఆలపిస్తున్న గాయిని అరుణా శ్రీనాథ్

ప్యారీస్, సెప్టెంబర్ 22 (ఆంధ్రజ్యోతి): తిరువళ్లూరు జిల్లా పెరియపాళయం సమీపంలోని ఆర్యపాక్కం గ్రామంలో చదువుల తల్లి క్షేత్రంగా ప్రసిద్ధిగాంచిన విద్యారంభ జ్ఞాన సరస్వతి ఆలయంలో నవరాత్రి ఉత్సవాలు సోమవారం ఉదయం కలశస్థాపన, బొమ్మల కొలువు, ప్రత్యేక పూజలతో ప్రారంభమయ్యాయి. ఉదయం 7 గంటలకు గోపూజ, 7.15 గంటలకు హోమం, 8 గంటలకు అభిషేకం, 8.30 గంటలకు కుంకుమార్చన అనంతరం ప్రముఖ గాయిని అరుణా శ్రీనాథ్ భక్తిగీతాలను ఆలపించి భక్తులను ఆకట్టుకున్నారు. అనంతరం ఆమెను మణిమాలారావు పట్టు వస్త్రాలతో సత్కరించారు. నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా తొలిరోజు రాజరాజేశ్వరి అలంకారంలో అమ్మవారు భక్తులకు దర్శనమిచ్చారు. అక్టోబర్ 2వ తేదీన అక్షరాభ్యాసం కార్యక్రమంతో నవరాత్రి ఉత్సవాలు పూర్తవుతాయని ఆలయ నిర్వాహకులు గురుస్వామి భక్తవత్సలం, ధర్మకర్త వీవీ.కృష్ణారావులు తెలిపారు.

### వేళచ్చేరిలోఎంటీసీ బస్సుల ఢీ

● 8 మందికి గాయాలు

అడయార్, సెప్టెంబరు 22 (ఆంధ్రజ్యోతి): స్థానిక వేళచ్చేరి మెయిన్ రోడ్డులో సోమవారం ఉదయం రెండు ఎంటీసీ బస్సులు (సిటీ బస్సులు) ఎదురెదురుగా ఢీకొన్నాయి. ఈ ప్రమాదంలో ఓ బస్సు డ్రైవర్‌తో సహా మొత్తం 8 మంది ప్రయాణికులు గాయపడ్డారు. టీనగర్ డిపో నుంచి సోమవారం ఉదయం 7 గంటలకు వి51ఎఫ్ రూట్ బస్సు బయలుదేరింది. అలాగే, కొళత్తూరు నుంచి టీనగర్‌కు వస్తున్న ఎం.51వి బసు వేళచ్చేరి మెయిన్ రోడ్డు, దండీశ్వరం ఆలయం వద్ద రోడ్డు మలుపులో ఎదురెదురుగా ఢీకొన్నాయి. ఈ ఘటనలో రెండు బస్సుల ముందు భాగం దెబ్బతింది అలాగే, వి51ఎఫ్ బస్సు డ్రైవర్ అన్బళగన్ (41)తో సహా ఇదే బస్సులోని 8 మంది గాయపడ్డారు. గాయపడిన వారిని 108 అంబులెన్స్‌తో రాయపేట ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు.

### వైద్యుల సంఘ అధ్యక్షుడి బదిలీపై స్టే

అడయార్, సెప్టెంబరు 22 (ఆంధ్రజ్యోతి): తమ డిమాండ్ల పరిష్కారం కోసం సేలం జిల్లా మేట్టూరు నుంచి చెన్నై వరకు పాదయాత్ర చేసిన ప్రభుత్వ వైద్యుల సంఘం అధ్యక్షుడు పెరుమాళ్ పిళ్లైపై ప్రభుత్వం కక్ష సాధింపు చర్యల్లో భాగంగా బదిలీ చేస్తూ ఇచ్చిన ఉత్తర్వులపై మద్రాస్ హైకోర్టు సింగిల్ జడ్జి తాత్కాలిక స్టే విధించారు. జూన్ నెల 11 నుంచి 19వ తేదీ వరకు ఆయన వివిధ డిమాండ్ల పరిష్కారం కోసం ఈ పాదయాత్ర చేపట్టారు. ఈ నేపథ్యంలో ఎగ్మోర్‌లోని చిన్న పిల్లల ఆస్పత్రి నుంచి నాగపట్టణం ప్రభుత్వ వైద్య కాలేజీ ఆస్పత్రికి ప్రభుత్వం బదిలీ చేసింది. దీనిని వ్యతిరేకిస్తూ ఆయన హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. తాను చేపట్టిన పాదయాత్రపై శాఖాపరమైన చర్యలు పెండింగ్‌లో ఉన్న నేపథ్యంలో తనను చెన్నై నుంచి నాగపట్టణంకు బదిలీ చేయడం చట్ట వ్యతిరేకమని అందువల్ల తన బదిలీ ఉత్తర్వులను రద్దు చేయాలని కోరుతూ హైకోర్టులో పిటిషన్ దాఖలుచేశారు. దీనిపై న్యాయమూర్తి జగదీష్ చంద్ర విచారణ జరిపారు. వాదనాలు పూర్తయిన తరువాత బదిలీ ఉత్తర్వులపై తాత్కాలిక స్టే విధించడంతో పాటు రెండు వారాల్లో కౌంటర్ దాఖలు చేయాలని ప్రభుత్వాన్ని ఆదేశించారు.

### సాత్తనూర్ డ్యాం నుంచి అదనపు జలాలు

ప్యారీస్, సెప్టెంబర్ 22(ఆంధ్రజ్యోతి): విల్లుపురం జిల్లాలోని సాత్తనూర్ డ్యాం పూర్తిసామర్థ్యంతో నిండిన కారణంగా ఈ డ్యాంలో అదనపు జలాలను ఆదివారం ఉదయం ప్రజాపనులశాఖ అధికారులు విడుదల చేశారు. ప్రస్తుతం విల్లుపురం జిల్లాలో కురుస్తున్న భారీవర్షాల కారణంగా సాత్తనూర్ డ్యాంలో అధికంగా నీరుచేరుతోంది. 119 అడుగుల పూర్తిసామర్థ్యం కలిగిన ఈ డ్యాంలో ఆదివారం ఉదయం 8గంటలకు నీటిమట్టం 116.75 అడుగులకు పెరిగింది. డ్యాం భద్రతను దృష్టిలో ఉంచుకుని అదనపు జలాలను ప్రధానకాలువల్లోకి అధికారులు విడుదల చేశారు. ఈ నీటితో దక్షిణ పెన్నా నదీ పరివాహక ప్రాంతాల్లో ఉన్న మరనేడు, కురివినత్తం, పరిక్కల్‌పట్టు, సూర్యాంకుప్పం తదితర ప్రాంతాల ప్రజలను అధికారులు అప్రమత్తం చేశారు.

### సీమాన్‌పై స్టే కొనసాగింపు

అడయార్, సెప్టెంబరు 22 (ఆంధ్రజ్యోతి): డీఐజీ వరుణ్ కుమార్‌పై అసత్య ప్రచారం చేసిన నామ్ తమిళర్ కట్చి కన్వీనర్ సీమాన్‌పై గతంలో విధించిన స్టే కొనసాగుతుందని మద్రాస్ హైకోర్టు ఆదేశించింది. ఇటీవల ఐపీఎస్ అధికారి వరుణ్ కుమార్, సీమాన్‌ల మధ్య మాటల యుద్ధం జరిగింది. ఆ సమయంలో వరుణ్ కుమార్‌పై సీమాన్ అసత్య ఆరోపణలు చేశారు. దీంతో వరుణ్ కుమార్ తనపై అసత్య ప్రచారం చేస్తున్న సీమాన్‌పై మద్రాస్ హైకోర్టులో పరువు నష్టం కేసు వేశారు. ఈ పిటిషన్‌ను విచారణకు స్వీకరించిన కోర్టు.. సీమాన్ ఎలాంటి విమర్శలు చేయకుండా స్టే విధించింది. ఈ పిటిషన్ మరోమారు విచారణకు రావడంతో గతంలో విధించిన స్టే కొనసాగించింది.

### 11న ఆలయ ఉద్యోగుల మహానాడు

ప్యారీస్, సెప్టెంబర్ 22 (ఆంధ్రజ్యోతి): తమిళనాడు ఆలయాల ఉద్యోగుల యూనియన్, పురాతన ఆలయాల ఉద్యోగుల సంఘాల సంయుక్త ఆధ్వర్యంలో వచ్చే అక్టోబర్ 11న నగరంలో రాష్ట్రస్థాయి మహానాడు నిర్వహించనున్నట్లు ప్రకటించారు.. ప్యారీస్‌లోని రాజా అన్నామలై హాలులో జరుగనున్న ఈ మహానాడును దేవాదాయ శాఖ మంత్రి పీకేశేఖర్‌బాబు ప్రారంభించనున్నారు. ఇందులో రాష్ట్రంలోని 38 జిల్లాల ఆలయాల్లో పనిచేస్తున్న ఉద్యోగులు, సంఘ నాయకులు పాల్గొననున్నారు. మహానాడును విజయవంతం చేసేందుకు రిసెప్షన్, ఫుడ్, సంగీతం, ప్రసార కమిటీలను నియమించినట్లు సీనియర్ అర్చకులు ముత్తుస్వామి, నిర్వాహకులు వేలాయుధం, కీర్తివాసన్ ఓ ప్రకటనలో తెలిపారు.

## రహదారిపై గుంత



వేలూరు, సెప్టెంబర్ 22 (ఆంధ్రజ్యోతి): వేలూరు వెల్లాడి ప్రాంతంలోని వెప్పమర రోడ్డులో నూతనంగా నిర్మించిన రోడ్డుపై ఏర్పడిన గుంతతో వాహనచోదకులు ఇబ్బందులకు గురవుతున్నారు. రోడ్డుపై ఏర్పడిన ఈ గుంతపై ట్రాఫిక్ అధికారులు ఐరన్ స్తంభాన్ని అడ్డుగా వేశారు. రాత్రి వేళల్లో ఆ స్తంభం కనిపించక ప్రమాదాలు జరుగుతున్నాయని స్థానికులు తెలిపారు. అధికారులు స్పందించి రోడ్డుపై ఏర్పడిన ఈ గుంతకు మరమ్మతులు చేసి ప్రమాదాలు జరగకుండా చొరవ తీసుకోవాలని ప్రజలు వాపోతున్నారు.

## రేషన్‌షాపుల్లో కొబ్బరినూనె విక్రయించాలి

● చిన్నమనూరులో రైతుల ధర్నా


చిన్నమనూరు సహకార సంఘం వద్ద ధర్నా చేస్తున్న రైతులు

చెన్నై, సెప్టెంబరు 22 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో రేషన్‌షాపుల్లో పామాయిల్‌కు బదులుగా కొబ్బరి నూనె విక్రయించాలని డిమాండ్ చేస్తూ సోమవారం ఉదయం తేని జిల్లా చిన్నమనూరు సహకార సంఘ కార్యాలయం ఎదుట రైతులు ధర్నా నిర్వహించారు. రేషన్‌షాపుల్లో కొబ్బరి నూనె విక్రయించేందుకు ప్రభుత్వం చర్యలు చేపట్టాలని రైతులు నినాదాలు చేశారు. రైతుల సంఘం తేని జిల్లా శాఖ అధ్యక్షుడు శివనాండి, కార్యదర్శి ఫ్రాన్సిస్ జేవియర్ నేతృత్వంలో రాష్ట్ర రైతుల సంఘం, ఏర్‌మునై యువజన విభాగం ఈ ఆందోళనలో పాల్గొన్నారు.

### ప్రత్యేక ఆర్థిక మండళ్ల ద్వారా ఉద్యోగావకాశాలు

● ఒకే ఏడాదిలో 7లక్షల మందికి లబ్ధి

ప్యారీస్, సెప్టెంబర్ 22 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో ప్రత్యేక ఆర్థిక మండళ్ల ద్వారా 2024-25 ఆర్థిక సంవత్సరంలో సుమారు 7లక్షల మందికి ఉద్యోగావకాశాలు లభించాయని రాష్ట్రప్రభుత్వం సోమవారం విడుదల చేసిన ప్రకటనలో తెలిపింది. రాష్ట్రంలోని ప్రత్యేక ఆర్థిక మండళ్లలో గత సంవత్సరం రూ.2,20,501 కోట్ల విలువైన వస్తువులు ఎగుమతయ్యాయని, దీని ద్వారా 6,99,700 మందికి ఉపాధి అవకాశాలు కలిగినట్లు ప్రభుత్వం తెలిపింది. ఇందులో గరిష్ఠంగా చెంగల్పట్టు జిల్లాలో రూ.1,54,403 కోట్ల విలువకు ఎగుమతి జరిగింది. దీని ద్వారా 3,57,758 మంది ఆర్థికంగా లబ్ధిపొందారు. రెండో స్థానంలో నిలిచిన చెన్నై జిల్లాలో రూ.34,837 కోట్ల విలువైన వస్తువుల ఎగుమతి కాగా, ఇందులో 1,59,687 మందికి ఉపాధి అవకాశం కలిగింది. ఇందులో భాగంగా కోవై, కాంచీపురం, తిరునల్వేలి, కృష్ణగిరి, మదురై జిల్లాలు 3వ స్థానంలో ఉన్నట్లు ప్రభుత్వం తెలిపింది.

### భవన నిర్మాణ కార్మికులకు క్యాన్సర్ పరీక్షలు




వైద్య పరీక్షలకు వచ్చిన కార్మికులు

అడయార్, సెప్టెంబరు 22 (ఆంధ్రజ్యోతి): క్రెడాయ్ ఆధ్వర్యంలో భవన నిర్మాణ కార్మికులకు క్యాన్సర్ స్క్రీనింగ్ పరీక్షలు చేశారు. సాయి హీలింగ్ ట్రస్ట్ సహకారంతో ఈ వైద్య పరీక్షలు చేశారు. ఈ నెలలో ఇప్పటివరకు 5 వేల మంది నిర్మాణ కార్మికులు, ఈ యేడాది చివరి నాటికి 20 వేల మంది కార్మికులకు స్క్రీనింగ్ చేయాలని లక్ష్యం చేసుకున్నట్టు క్రెడాయ్ చెన్నై అధ్యక్షుడు మహమ్మద్ అలీ వెల్లడించారు. ఇదే విషయంపై ఆయన మాట్లాడుతూ, నిర్మాణ రంగానికి ఆధారమైన కార్మికుల ఆరోగ్యం, శ్రేయస్సు మాకు అత్యంత ముఖ్యమన్నారు. ఈ స్క్రీనింగ్ పరీక్షల ద్వారా కార్మికుల్లో అనారోగ్య సమస్యలను గుర్తించి తక్షణం సంరక్షణ చర్యలు చేపట్టేందుకు ఎంతో దోహదపడతాయన్నారు.

### కమనీయం శ్రీనివాసుడి కల్యాణం


కల్యాణం నిర్వహిస్తున్న పురోహితులు

ప్యారీస్, సెప్టెంబర్ 22 (ఆంధ్రజ్యోతి): స్థానిక పాతచాకలిపేటలో ఆదిఆంధ్రులు నివసిస్తున్న ధర్మరాజు గుడివీధిలో తిరుమల బ్రహ్మోత్సవాలను పురస్కరించుకుని ఆదివారం రాత్రి నిర్వహించిన శ్రీనివాసుడి కల్యాణం కమనీయంగా సాగింది. భగవాన్ వెంకటేశ్వర కళామందిర్, జీష్ణు గణపతి ఆలయం సంయుక్త ఆధ్వర్యంలో 34వ వార్షిక శ్రీవారి ఉత్సవాలను బుధవారం వరకు నిర్వహించనున్నారు. ఆదివారం రాత్రి పూలు, అరటి, మామిడి తోరణాలు, విద్యుద్దీపాలతో ఏర్పాటు చేసిన వేదికపై శ్రీదేవి, భూదేవి సమేత వెంకటేశ్వరస్వామివార్లకు పురోహితులు కల్యాణ తంతును శాస్త్రోక్తంగా నిర్వహించారు. వందలాది మంది భక్తుల గోవిందనామస్మరణతో వేదిక ప్రాంగణం మార్మోగింది. గురుస్వామి వి.కుమారస్వామితో పాటు నిర్వాహకులు, శ్రీరామ భజన బృందం సభ్యులు, గ్రామస్థులు పాల్గొనగా అందరికీ ప్రసాదాలు పంపిణీ చేశారు.


పూజా కార్యక్రమంలో శ్రీవారి భక్తులు

### రోడ్లు బాగుచేయండి మహాప్రభో!

తిరుత్తణి, సెప్టెంబర్ 22 (ఆంధ్రజ్యోతి): తిరువళ్లూరు జిల్లా పళ్లిపట్టు సమీపంలోని వెంగంపేట గ్రామంలో రోడ్లు మరమ్మతులకు గురై గ్రామస్థులు తీవ్రంగా ఇబ్బంది పడుతున్నారు. పళ్లిపట్టు నుంచి చిత్తూరు వెళ్లే ఈ మార్గంలో గత కొన్నిరోజులుగా వాహనాలు ప్రమాదాలకు గురవుతున్నాయని, గర్భిణులు, పిల్లలతో ఈ రోడ్లపై ప్రయాణించడం ప్రమాదకరంగా మారిందని, దీనిపై అధికారులకు పలుమార్లు ఫిర్యాదు చేసినా ఫలితంలేదని ప్రజలు వాపోతున్నారు. ఇప్పటికైనా అధికారులు దీనిపై చర్యలు తీసుకుని నూతన రోడ్ల నిర్మాణం పనులు చేపట్టాలని గ్రామస్థులు కోరుతున్నారు.


గుంతలమయమైన రోడ్డు



శ్రద్ధా శ్రీనాథ్

# హీరోలతో రొమాన్స్ చేయలేను

● శ్రద్ధా శ్రీనాథ్

హీరోలతో రొమాన్స్ చేయలేనని అందువల్ల అలాంటి సినిమాలకు తాను దూరంగా ఉంటున్నానని హీరోయిన్ శ్రద్ధా శ్రీనాథ్ అన్నారు. తమిళం, తెలుగు, కన్నడ, మలయాళం తదితర భాషా చిత్రాల్లో నటిస్తూ బిజీగా ఉన్న శ్రద్ధా... తాజాగా ఇచ్చిన ఇంటర్వ్యూలో మాట్లాడుతూ, 'కొందరు హీరోయిన్లు అగ్ర హీరోలు, ఇతర నటులతో కలిసి నటించేటపుడు ఆయా చిత్రాల్లో రొమాన్స్ సన్నివేశాలుంటే అలవోకగా చేసేస్తున్నారు. కానీ, నాకు మాత్రం హీరోలతో రొమాన్స్ చేయడం ఏమాత్రం సరిపోవడం లేదు. అందుకే అలాంటి చిత్రాలను నేను తిరస్కరిస్తున్నాను. గతంలో ఈ తరహా కథా పాత్రలున్న అనేక చిత్రాలు వచ్చాయి. కానీ, రొమాన్స్ సన్నివేశాల్లో నేను నటించలేనని భావించి, వాటిలో నటించేందుకు అంగీకరించలేదు. కథకు తగిన పాత్ర ఉన్న సినిమాలకు మాత్రమే కమిట్ అవుతున్నాను. ఇప్పటివరకు నేను నటించిన చిత్రాల్లోని నా పాత్రలన్నీ ఆ తరహాలోనే ఉన్నాయని గట్టిగా భావిస్తున్నాను. ముందు కూడా నాకు నచ్చిన కథా పాత్రలను మాత్రమే ఎంచుకుని నటిస్తాను' అని శ్రద్ధా శ్రీనాథ్ స్పష్టం చేశారు.



'డ్యూడ్'లో ప్రదీప్ రంగనాథన్, మమిత బైజు

# దీపావళి రేసులో ప్రదీప్ 'డ్యూడ్'

'డ్రాగన్' వంటి హిట్ మూవీ తర్వాత ప్రదీప్ రంగనాథన్ నటిస్తున్న 'డ్యూడ్' దీపావళికి విడుదల చేయాలని మేకర్స్ నిర్ణయించారు. తమిళం, తెలుగు సహా ఐదు భాషల్లో రూపొందుతున్న ఈ చిత్రాన్ని టాలీవుడ్ నిర్మాణ సంస్థ మైత్రీ మూవీ మేకర్స్ నిర్మిస్తోంది. ఇందులో ప్రదీప్ రంగనాథన్ సరసన మమిత బైజు హీరోయిన్‌గా నటించగా, సీనియర్ నటుడు శరత్ కుమార్, సీనియర్ నటి రోహిణి ముఖ్యపాత్రలు పోషిస్తున్నారు. కీర్తిశ్వరన్ దర్శకుడు. ఇదిలావుంటే, ప్రదీప్ రంగనాథన్ హీరోగా విఘ్నేష్ శివన్ దర్శకత్వంలో రూపొందుతున్న 'ఎల్ఐకే' మూవీ కూడా దీపావళికి విడుదల చేయాలని భావిస్తున్నారు. అయితే, దీనిపై మేకర్స్ నుంచి ప్రకటన మాత్రం రాలేదు.

# యాక్షన్ కింగ్ అర్జున్ హీరోగా క్రైమ్ థ్రిల్లర్



'తీయవర్ కులై నడుంగ'లో ఐశ్వర్య రాజేష్, అర్జున్

యాక్షన్ కింగ్ అర్జున్ - ఐశ్వర్య రాజేష్ ప్రధాన పాత్రల్లో నటిస్తున్న క్రైమ్ థ్రిల్లర్ యాక్షన్ మూవీకి 'తీయవర్ కులై నడుంగ' అనే టైటిల్ ఖరారు చేశారు. ఇతర పాత్రల్లో బిగ్ బాస్ ఫేం అభిరామి, రామ్‌కుమార్, జీకే రెడ్డి, లోగు, వేల రామమూర్తి, పీఎల్ తేనప్పన్ తదితరులు నటించారు. ఈ చిత్రాన్ని జీఎస్ ఆర్ట్స్ పతాకంపై జి.అరుల్ కుమార్ నిర్మిస్తున్నారు. దినేష్ లక్ష్మణన్ దర్శకత్వం వహించిన ఈ చిత్రం టీజర్‌ను తాజాగా ప్రముఖ దర్శకుడు ఏఆర్.మురుగదాస్ రిలీజ్ చేశారు. ఈ సినిమా విశేషాలను దర్శకుడు వివరిస్తూ, 'చట్టానికి అతీతంగా న్యాయం ఉంటుంది. న్యాయానికి మించిన ధర్మం ఉంటుంది. అంతిమంగా ధర్మమే విజయం సాధిస్తుందన్న కథాంశంతో రూపొందిస్తున్నాం. అర్జున్ విచారణాధికారిగా నటిస్తున్నారు. ఐశ్వర్య రాజేష్ మాత్రం సస్పెన్స్ రోల్ పోషిస్తున్నారు. ఇప్పటికే విడుదలైన ఈ టీజర్‌కు మంచి స్పందన వచ్చింది.

## చిత్రజ్యోతి



చిత్రంలో రియో రాజ్, మాళవిక మనోజ్

# అక్టోబరు 31న 'ఆణ్‌పావం పొల్లాదదు'

డ్రమ్ స్టిక్ ప్రొడక్షన్ పతాకంపై వెడిక్కారన్‌పట్టి ఎస్.శక్తివేల్ నిర్మించిన చిత్రం 'ఆణ్‌పావం పొల్లాదదు'. రియో రాజ్, మాళవిక మనోజ్ హీరోహీరోయిన్లుగా నటించగా, కలైయరసన్ తంగవేల్ కథ సమకూర్చి దర్శకత్వం వహించారు. మానసికంగా ఎదుగుదల లేని భార్య వల్ల ఎదురయ్యే సమస్యలను ప్రధాన ఇతివృత్తంగా తీసుకుని ప్రేమ కథా చిత్రంగా రూపొందించారు. అక్టోబరు 31న విడుదల చేయనున్నట్టు మేకర్స్ అధికారికంగా వెల్లడించారు. 1985లో పాండ్యరాజన్ రచించి దర్శకత్వం వహించిన 'ఆణ్‌పావం' సినిమాకు.. ఈ మూవీకి టైటిల్ మినహా ఎలాంటి సంబంధం లేదని దర్శక నిర్మాతలు స్పష్టం చేశారు. కాగా ఈ సినిమా టీజర్‌ను ప్రముఖ దర్శకుడు లోకేష్ కనకరాజ్ విడుదల చేయగా, దీనికి మంచి స్పందన వచ్చిన విషయం తెల్సిందే. ఇదిలావుండగా రియో రాజ్ నటించిన 'జో', 'స్వీట్‌హార్ట్' మూవీలు ఘన విజయం సాధించడంతో ఈ చిత్రంపై కూడా ప్రేక్షకుల్లో అంచనాలు నెలకొన్నాయి.





బతుకమ్మల ముందు మంత్రి శేఖర్‌బాబు - వేదిక ప్రాంగణంలో తెలంగాణ ఆడపడుచుల సందడి

# వైభవంగా ఎంగిలి పూల బతుకమ్మ సంబరాలు

ప్యారీస్, సెప్టెంబర్ 22 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు నెలవైన బతుకమ్మ వేడుకలు ఆదివారం రాత్రి నగరంలో ఘనంగా ప్రారంభమయ్యాయి. 'చెన్నై తెలంగాణ సంఘం' ఆధ్వర్యంలో జార్జిటౌన్‌లో ప్రసిద్ధి చెందిన కన్యకా పరమేశ్వరి దేవస్థానం (ఎస్‌కేపీడీ)ప్రాంగణంలో తొలిరోజు ఎంగిలిపూల బతుకమ్మ వేడుకలను రాష దేవాదాయశాఖ మంత్రి పీకే.శేఖర్‌బాబు ముఖ్యఅతిథిగా హాజరై ప్రారంభించారు. సంప్రదాయ వస్త్రధారణలతో పాల్గొన్న తెలంగాణ ఆడపడుచులు వివిధ రకాల పూలతో బతుకమ్మలను వేదిక ప్రాంగణంలో ఏర్పాటు చేసి బతుకమ్మ ఉయ్యాలో అంటూ ఆటపాటలతో ఎంగిలిపూల బతుకమ్మ ఉత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. మల్లెపూల బతుకమ్మ, గులాబి బతుకమ్మ, బంతిపూల బతుకమ్మ, చామంతిపూల బతుకమ్మ, కనకాంబరాల బతుకమ్మ అంటూ పాడుతూ సందడి చేశారు. నగరంలో పలు ప్రాంతాల్లో నివసిస్తున్న తెలంగాణ ప్రాంతాలకు చెందిన వారంతా ఉత్సాహంగా రావడంతో వేదిక ప్రాంగణం కిటకిటలాడింది. మంత్రితో పాటు అతిథులు ఎస్.మురళీ, పి.శ్రీరాములు, అపరంజి తదితరులను బతుకమ్మ ఉత్సవ కమిటీ నిర్వాహకులు ఘనంగా సత్కరించారు. సంఘ నిర్వాహకులు డి.అంజయ్య, ఎం.పరుశురాములు, సీహెచ్ శ్రీనివాస్, ఎస్‌కే షఫీ, సీహెచ్ నరసింహ, ఎన్.అశోక్, సి.అంజయ్య, సీహెచ్ గిరి, ఎం.రమేష్, పీఎన్ శ్రీనివాస్ తదితరులు ఏర్పాట్లు పర్యవేక్షించి భక్తులందరికీ ప్రసాదాలు పంపిణీ చేశారు. ఈ నెల 29వ తేదీ సోమవారం సాయంత్రం 5 నుండి రాత్రి 9 గంటల వరకు షావుకారుపేట అమ్మన్‌కోవిల్ వీధిలో ఉన్న జీఎంటీటీ పాఠశాల ప్రాంగణంలో సద్దుల బతుకమ్మ వేడుకలు నిర్వహించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు.

# నలుగురు క్రీడాకారులకు ప్రభుత్వ ఉద్యోగాలు

● ఉత్తర్వులందించిన సీఎం స్టాలిన్



సచివాలయంలో క్రీడాకారులు వైశాలి, సుమిత్ర, సత్య, చిత్రేష్ దత్తాకు ఉద్యోగ నియామక పత్రాలు అందజేస్తున్న ముఖ్యమంత్రి ఎంకే స్టాలిన్

చెన్నై, సెప్టెంబరు 22 (ఆంధ్రజ్యోతి): జాతీయ, అంతర్జాతీయ క్రీడా పోటీల్లో ప్రతిభ కనబరచి పతకాలు సాధించిన, రాష్ట్రానికి చెందిన నలుగురు క్రీడాకారులకు ప్రభుత్వ ఉద్యోగాలు లభించాయి. సచివాలయంలో సోమవారం ఉదయం జరిగిన కార్యక్రమంలో ముఖ్యమంత్రి స్టాలిన్ వీరికి నియామక ఉత్తర్వులు అందజేశారు. చైనాలో జరిగిన 19వ ఆసియా క్రీడాపోటీల్లో ద్వితీయ బహుమతి గెలుచుకున్న చెస్ క్రీడాకారిణి ఆర్.వైశాలికి రాష్ట్ర పారిశ్రామిక పెట్టుబడుల సంస్థలో, నేపాల్‌లో జరిగిన 13వ దక్షిణాసియా క్రీడాపోటీల్లో ప్రథమ బహుమతి పొందిన ఫుట్‌బాల్ క్రీడాకారిణి కె.సుమిత్రకు రాష్ట్ర పారిశ్రామికాభివృద్ధి సంస్థలో, బాస్కెట్ బాల్ క్రీడాకారిణి ఎస్.సత్యకు తమిళనాడు సిమెంట్ కార్పొరేషన్‌లో నియమిస్తూ ఉత్తర్వులిచ్చారు. ఇదే విధంగా చైనాలో 19వ ఆసియా క్రీడా పోటీల్లో సర్ఫింగ్‌లో ప్రతిభ కనబరచిన క్రీడాకారుడు చిత్రేష్ దత్తాకు సిప్కాట్‌లో నియమిస్తూ ఉత్తర్వులను స్టాలిన్ అందజేశారు. ఈ కార్యక్రమంలో ఉప ముఖ్యమంత్రి ఉదయనిధి, మంత్రి టీఆర్బీ రాజా, యువజన సంక్షేమం క్రీడాభివృద్ధి శాఖ ప్రధాన కార్యదర్శి అతుల్య మిశ్రా, పారిశ్రామిక, పెట్టుబడుల ప్రోత్సాహక వాణిజ్య శాఖ కార్యదర్శి అరుణ్ రాయ్,టరాష్ట్ర క్రీడాభివృద్ధి సంస్థ మెంబర్ సెక్రటరీ జే మేఘనాథరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# గీతా రాధ భౌతికకాయానికి పలువురి నివాళి

● అంత్యక్రియలు పూర్తి



గీత భౌతిక కాయానికి నివాళులు అర్పిస్తున్న సీఎం స్టాలిన్, డిప్యూటీ సీఎం ఉదయనిధి తదితరులు

అడయార్, సెప్టెంబరు 22 (ఆంధ్రజ్యోతి): దివంగత ప్రముఖ నటుడు ఎంఆర్ రాధా సతీమణి, సినీ నటి రాధిక మాతృమూర్తి గీతా రాధ ఆదివారం రాత్రి తుదిశ్వాస విడువగా, ఆమె భౌతికకాయానికి ముఖ్యమంత్రి ఎంకే స్టాలిన్, ఉప ముఖ్యమంత్రి ఉదయనిధి సోమవారం నివాళులర్పించారు. తల్లిని కోల్పోయి దుఃఖసాగరంలో మునిగిపోయిన నటీమణి రాధిక, ఆమె భర్త శరత్ కుమార్, సోదరి నిరోషాలను పరామర్శించి తమ సంతాపాన్ని తెలిపారు. సీఎం స్టాలిన్ వెంట ఎమ్మెల్యే ఎన్ ఎళిలన్, తమిళనాడు హౌసింగ్ బోర్డు అధ్యక్షుడు పూచ్చి మురుగన్, చెన్నై కార్పొరేషన్ స్టాండిగ్ కమిటీ చైర్మన్ ఎన్.సిట్రరసు, నటుడు రాధారవి, చెన్నై కార్పొరేషన్ మాజీ డిప్యూటీ మేయర్ కరాటే త్యాగరాజన్ తదితరులున్నారు. కాగా, గీతా రాధ అంత్యక్రియలను బీసెంట్ నగరంలోని విద్యుత్ దహనవాటికలో పూర్తి చేశారు.



కార్యక్రమంలో ఎస్‌కేపీడీ ట్రస్టీలు

# ఎస్‌కేపీడీలో దేవీ నవరాత్రులు ప్రారంభం

ప్యారీస్, సెప్టెంబర్ 22 (ఆంధ్రజ్యోతి): స్థానిక కొత్వాల్ బజార్ ఆదియప్పనాయకన్‌వీధిలోని కన్యకా పరమేశ్వరి దేవస్థానం (ఎస్‌కేపీడీ)లో విశ్వావసు నామసంవత్సర అశ్వయుజ శుద్ధ పాడ్యమి సందర్భంగా సోమవారం నుండి శరన్నవరాత్రులు ప్రారంభమయ్యాయి. ఉదయం 6 నుండి కలశ స్థాపన, 9 గంటలకు వాసవీ కన్యకా పరమేశ్వరి మూలమంత్ర హోమాలను ఆలయ అర్చకులు శాస్త్రోక్తంగా నిర్వహించారు. శక్తిస్వరూపిణి అయిన అమ్మవారిని నవరాత్రుల సందర్భంగా వివిధ అలంకారాల్లో కొలువుదీర్చేందుకు ఆలయ ప్రాంగణంలో ఏర్పాట్లు చేశారు. ఉత్సవాలను విజయవంతంగా నిర్వహించేలా ఎస్‌కేపీడీ చారిటీస్ ధర్మకర్త కొల్లా చంద్రశేఖర్, ట్రస్టీలు ఊటుకూరు శరత్‌కుమార్, దేసు లక్ష్మీనారాయణ, ఎస్ఎల్.సుదర్శనం, టీవీ రామకుమార్, సీఆర్.కిషోర్‌బాబు, తాతా బద్రినాథ్, కార్యదర్శి ఎం.కిషోర్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు. తొలి రోజు హంసవాహనంపై సరస్వతి అలంకారంలో దర్శనమిచ్చిన అమ్మవారిని భక్తిశ్రద్ధలతో సేవించారు.

# వైభవంగా తిరుమల వేంకటేశ్వరస్వామి పూజలు



పూలు, కరెన్సీ నోట్లతో స్వామి వారికి అలంకరణ

ప్యారీస్, సెప్టెంబర్ 22 (ఆంధ్రజ్యోతి): స్థానిక కొరుకుపేట చిగురింతపాలెం రెండవ వీధిలోని కళి వేంకటేశ్వర భక్త బృందం ఆధ్వర్యంలో 21వ వార్షిక ప్రత్యేక పూజలు వైభవంగా జరుగుతున్నాయి. తిరుమలలో జరిగే బ్రహ్మోత్సవాలను పురస్కరించుకుని సోమవారం ఉదయం 9 గంటలకు శ్రీదేవి భూదేవి సమేత శ్రీవారి అలంకరణతో వేడుకలు ప్రారంభమయ్యాయి. వేదిక ప్రాంగణాన్ని అరటి, మామిడి తోరణాలు, విద్యుద్దీపాలతో అలంకరించారు. ఆర్కేనగర్ ఎమ్మెల్యే జేజే ఎబినేజర్ ముఖ్యఅతిథిగా హాజరై ఆలయ ప్రాంగణంలో సహపంక్తి భోజన కార్యక్రమాన్ని ప్రారంభించారు. కార్యక్రమంలో కౌన్సిలర్ యు.గణేశన్, కేబీ సతీష్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు. బుధవారం వరకు నిర్వహించనున్న శ్రీవారి ప్రత్యేక పూజల్లో చిగురింతపాలెం గ్రామస్థులు, తిరుమల పాదయాత్ర సభ్యులు, వెంకటేశ్వర భక్త బృందం పాల్గొని అన్నదాన కార్యక్రమాలు నిర్వహించనున్నారు. 24న తిరుమలకు పాదయాత్రగా వెళ్లే భక్తులకు తిరువళ్లూరు జిల్లా కనకమ్మ సత్రంలో ఆహారం ప్యాకెట్లను అందజేయనున్నట్లు నిర్వాహకుల తరుపున కర్రా వెంకట సుబ్బయ్య తెలిపారు.



భోజనం వడ్డిస్తున్న ఎమ్మెల్యే ఎబినేజర్, వెంకట సుబ్బయ్య

# పోలీసు శాఖకు కొత్త భవనాలు

● ప్రారంభించిన సీఎం స్టాలిన్




వీడియో కాన్ఫరెన్స్ ద్వారా అగ్నిమాపక, పోలీసు శాఖ భవనాలను ప్రారంభిస్తున్న ముఖ్యమంత్రి

చెన్నై, సెప్టెంబరు 22 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర పోలీసు శాఖ ఆధ్వర్యంలో రూ.97.65 కోట్లతో నిర్మించిన పోలీసు క్వార్టర్స్, రెండు పోలీసు స్టేషన్లు, ఆరు భవనాలను ముఖ్యమంత్రి ఎంకే స్టాలిన్ ప్రారంభించారు. అగ్నిమాపక శాఖ ఆధ్వర్యంలో చెంగల్పట్టు జిల్లా కాలవాక్కంలో రూ.21.85 కోట్లతో నిర్మించనున్న రాష్ట్ర శిక్షణా సంస్థ భవనసముదాయానికి ఆయన శంకుస్థాపన చేశారు. ఆ శాఖ ఆధ్వర్యంలోనే రూ.3.16 కోట్లతో నిర్మించిన విల్లుపురం కొత్త జోనల్ కార్యాలయం, తిరుపత్తూరులో అగ్నిమాపక కేంద్ర భవనాన్ని ఆయన వీడియో కాన్ఫరెన్స్ ద్వారా ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి ఎన్.మురుగానందం ఎక్సైజ్ శాఖ అదనపు ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి ధీరజ్‌కుమార్, డీజీపీ (ఇన్‌ఛార్జ్) జి.వెంకట్రామన్, అగ్నిమాపక శాఖ సంచాలకులు సీమా అగర్వాల్, రాష్ట్ర పోలీసు గృహనిర్మాణ సంస్థ చైర్మన్ వినిత్ దేవ్ వాఖండే తదితరులు పాల్గొన్నారు.

### రూ.61.44 కోట్లతో హాస్టల్ భవనాలు...

సచివాలయంలో బీసీ, మైనారిటీ సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో జరిగిన మరో కార్యక్రమంలో రూ.61.44 కోట్లతో నిర్మించనున్న 8 హాస్టల్ భవనాలకు ముఖ్యమంత్రి స్టాలిన్ వీడియో కాన్ఫరెన్స్ ద్వారా శంకుస్థాన చేశారు. అదే విధంగా రూ.3.94 కోట్లతో నిర్మించిన అదనపు తరగతి గదులు, హాస్టల్ భవనానికి ఆయన ప్రారంభోత్సవం చేశారు. ఉపాధ్యాయుల ఎంపిక సంస్థ ద్వారా ఎంపికైన 23 మంది డిగ్రీ టీచర్లకు, 18 మంది సెకండరీ గ్రేడ్ టీచర్లకు నియామక పత్రాలను కూడా అందజేశారు. ఈ కార్యక్రమంలో బీసీల సంక్షేమ శాఖ మంత్రి మెయ్యనాథన్, బీసీ, ఎంబీసీ, మైనారిటీ సంక్షేమ శాఖ ప్రభుత్వ కార్యదర్శి ఎ.శరవణవేల్‌రాజ్, బీసీ సంక్షేమ శాఖ కమిషనర్ సి.సురేష్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

## డ్రగ్స్‌కు వ్యతిరేకంగా 'షార్ట్ ఫిలిమ్స్ ఆన్ వీల్స్'



మీడియా సమావేశంలో నిర్వాహకులు

అడయార్, సెప్టెంబరు 22 (ఆంధ్రజ్యోతి): చెన్నై మహానగర వ్యాప్తంగా మాదకద్రవ్యాల వినియోగం, వాటివల్ల కలిగే నష్టాలను వివరిస్తూ, అవగాహన కల్పించేలా 'షార్ట్ ఫిలిమ్స్ ఆన్ వీల్స్' అనే ప్రచార కార్యక్రమాన్ని ప్రముఖ కంపెనీ జి స్క్వేర్ ప్రారంభించింది. ఈ ప్రచారాన్ని ఆ కంపెనీ వ్యవస్థాపకుడు, మేనేజింగ్ డైరెక్టర్ బాల రామజయం, గ్రేస్ ఫౌండేషన్ మేనేజింగ్ ట్రస్టీ డాక్టర్ అధిర నావిస్ ప్రభాకర్, జి స్క్వేర్ వైస్ ప్రెసిడెంట్ సుందరం కలిసి ప్రారంభించారు. పాఠశాలలు, కళాశాలలు బహిరంగ ప్రదేశాల్లో వీటిని ప్రదర్శించనున్నారు. మద్యం, మాదకద్రవ్యాల వల్ల కలిగే నష్టాలు, అనారోగ్య సమస్యలపై ఈ షార్ట్ ఫిలిమ్స్‌లో చూపించనున్నట్లు మీడియా సమావేశంలో వెల్లడించారు.

# ప్రభుత్వ హాస్టల్‌లో మతమార్పిడి

● ఆరోపించిన బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు నయినార్ నాగేంద్రన్

ప్యారీస్, సెప్టెంబర్ 22 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో ప్రభుత్వ హాస్టల్‌లో ఉంటున్న విద్యార్థినులు బలవంతంగా మతమార్పిడికి గురవుతున్నారని బీజేపీ రాష్ట్ర అధ్యక్షులు నయినార్ నాగేంద్రన్ ఆరోపించారు. ఈ మేరకు ఆయన సోమవారం ప్రకటన విడుదల చేశారు. శివగంగ జిల్లా కాళయార్‌కోవిల్‌లోని ప్రభుత్వ ఆదిద్రావిడ హాస్టల్ వార్డెన్‌గా పనిచేస్తున్న లక్ష్మీ అక్కడున్న విద్యార్థినులను బలవంతంగా మతమార్పిడి చేస్తున్నారని, కాదన్నవారిని దారుణంగా హింసిస్తున్నారని, సరుకుల కొనుగోళ్లలో అవినీతికి పాల్పడుతున్నారని ఆయన ఆరోపించారు. ఈ విధంగా చిత్రహింసలకు గురైన ఓ విద్యార్థిని తల్లిదండ్రులు ముఖ్యమంత్రి సహా విద్యాశాఖ అధికారులకు లేఖలు రాసారని, వీటిపై ఎటువంటి చర్యలు లేవని తెలిపారు. రాష్ట్రప్రభుత్వం ప్రభుత్వ పాఠశాలలు, హాస్టళ్లలో విద్యార్థులకు కనీస వసతులు కల్పించడంలో విఫలమైందని, ముఖ్యంగా కమ్యూనిటీ హాస్టళ్లలో కుల వివక్ష, మతపరమైన దాడులను అడ్డుకోకుండా నిర్లక్ష్యం చూపుతోందని వ్యాఖ్యానించారు. ప్రభుత్వ హాస్టళ్లలో పనిచేస్తున్న ఉద్యోగులు చట్టవిరుద్ధంగా మతమార్పిడులకు పాల్పడేందుకు ఎవరు ప్రోత్సహిస్తున్నారు,

హిందూ మతాన్ని కించపరిచేందుకు ప్రయత్నిస్తున్నవారెవరన్న దానిపై తక్షణ విచారణ జరిపి ఈ చర్యలకు పాల్పడినవారిని చట్టపరంగా శిక్షించాలని ఆయన డిమాండ్ చేశారు. శివగంగ జిల్లాలో మతమార్పిడికి పాల్పడిన హాస్టల్ వార్డెన్ లక్ష్మీని విధుల నుండి డిస్మిస్ చేయాలని ఆయన డిమాండ్ చేశారు.

సచివాలయంలో ముఖ్యమంత్రి ఎంకే స్టాలిన్‌ను మర్యాదపూర్వకంగా కలుసుకున్న ప్రాంతీయ నావికాదళం ఉన్నతాధికారి రియర్ అడ్మిరల్ (ఫ్లాగ్ ఆఫీసర్ కమాండింగ్, (తమిళనాడు, పుదుచ్చేరి) సతీష్ షెనాయ్, కమాండర్లు ఆర్ నిర్మల్ కుమార్, ఎస్.జగన్ తదితరులు



బీసీ, మైనారిటీ సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో నిర్మించిన తరగతి గదులు, హాస్టళ్లను వీడియో కాన్ఫరెన్స్ ద్వారా ప్రారంభిస్తున్న సీఎం స్టాలిన్

